



నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 12 జూలై 2024 | RANGAREDDY


- మసకబారుతున్న రంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ ప్రతిష్ట
- మూడు నెలల వ్యవధిలోనే ఇద్దరు అధికారులపై వేటు
- గతంలో సూపరింటెండెంట్‌ను.. తాజాగా ఎఫ్‌డీవో సస్పెన్షన్
- యూపీఏ యాప్‌ల ద్వారా లంచాలు తీసుకున్నట్లు విచారణలో వెల్లడి
- చెరువులు తవ్వకుండానే బిల్లులు చేశారని ఏసీబీకి మత్స్యకారుల ఫిర్యాదు
- ఇప్పటివరకు తేలింది కొంతే!.. తేల్చాల్సింది చాలా ఉందంటున్న మత్స్యకారులు



## అవినీతి లెక్క..

# చెరువుకే ఎరుక!

**అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా** మారిన జిల్లా మత్స్యశాఖ ప్రతిష్ట రోజురోజుకూ మసకబారుతున్నది. మూడు నెలల వ్యవధిలోనే జిల్లా మత్స్యశాఖలో ఇద్దరిపై వేటు పడింది. మత్స్య సహకార సంఘాల ఏర్పాటు మొదలుకొని సభ్యత్వాల జారీ వరకు సంబంధిత అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. మత్స్యకార్మికుల నుంచి యూపీఏ యాప్‌ల ద్వారానూ లంచాలు స్వీకరించిన సందర్భాలున్నాయి. చెరువుల లీజు డబ్బులను సైతం సొంతానికి వాడుకున్నారు. వివిధ పథకాల కింద మంజూరైన పనులను చేపట్టకుండానే బిల్లులు పొందారంటూ కొంతమంది మత్స్యకారులు ఏకంగా ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా మత్స్యశాఖలో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రక్షాళన చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

-రంగారెడ్డి, జూలై 11(నమస్తే తెలంగాణ)

### అంతా అవినీతిమయం..

రంగారెడ్డి జిల్లాలో 799 వరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు 162, మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు 114 ఉన్నాయి. మరో ఆరు పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 9,136 మంది మత్స్య కార్మికులు సభ్యులుగా కొనసాగుతున్నారు. అయితే సొసైటీల ఏర్పాటు, సభ్యత్వం తదితర వాటిల్లో అధికారులు అక్రమంగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఒకే ప్రాంతంలో రెండు సొసైటీలకు అనుమతులు ఇవ్వొద్దన్న నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారన్న విమర్శలు మత్స్యకారుల నుంచి వినిపిస్తున్నాయి. సభ్యత్వాలను సైతం అడ్డగోలుగా ఇచ్చారన్న ఫిర్యాదులు ఉన్నాయి. చేప పిల్లల పంపిణీలోనూ అక్రమాలకు పాల్పడినట్లు ఇక్కడి అధికారులతోపాటు, ఉన్నతాధికారులపై ఫిర్యాదులు వెళ్లాయి. లంచాల డబ్బులను సైతం యూపీఏ యాప్‌ల ద్వారా వసూలు చేయడం అధికారుల బరితెగింపునకు అద్దంపడుతున్నది.

### అక్రమాలపై ఏసీబీకి ఫిర్యాదు..

జిల్లా మత్స్య శాఖలో వివిధ ప్రభుత్వ పథకాల అమలులో అక్రమాలు జరిగాయంటూ పలువురు మత్స్యకారులు ఈ ఏడాది మే నెలలో ఏసీబీకి ఫిర్యాదు చేశారు. నీలి విప్లవం, రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాల ద్వారా లబ్ధిదారులకు పథకాలను మంజూరు చేసిన సందర్భంలో అధికారులు వాటాలు వేసుకుని మరీ వసూలు చేశారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. చేపల చెరువులను నిర్మించకుండానే బిల్లులను కాజేశారన్న ఆరోపణలు సైతం వస్తున్న తరుణంలో ఆయా పథకాల ద్వారా మంజూరు చేసిన పనులపై సమగ్ర దర్యాప్తు చేయాలంటూ ఏసీబీకి కొందరు మత్స్యకారులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఇప్పటి దాకా తేల్చింది కొంతే! అని తేల్చాల్సిందే ఇంకా చాలా ఉందని మత్స్యకారులు పేర్కొంటున్నారు.



### మత్స్యశాఖ అధికారిపై సస్పెన్షన్ వేటు..

మత్స్యకారుల నుంచి వెళ్లిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారులు కమిటీ వేసి అక్రమాల నిగ్గు తేల్చారు. చేపల చెరువులకు సంబంధించిన లీజు డబ్బులను ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా సొంతంగా వాడుకున్నట్లు విచారణ అధికారులు తేల్చారు. రూ.62,547 లీజు డబ్బులను సూపరింటెండెంట్ సీహెచ్ రమేశ్‌ను వాడుకున్నట్లు విచారణలో తేలింది. అలాగే.. కార్యాలయంలో ఫర్నిచర్ ఏర్పాటు పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు సైతం తేలింది. ఈ క్రమంలో అతన్ని మూడు నెలల క్రితం ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ తర్వాత మరింత లోతుగా విచారణ జరిపిన విచారణ కమిటీ జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తిని సైతం బాధ్యులుగా చేసింది. ఈ మేరకు మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఈ నెల 9న సుకీర్తిపై సస్పెన్షన్ వేటు వేసింది. మత్స్యశాఖలో ఏడీఎఫ్‌గా పనిచేస్తున్న చరితకు ఎఫ్‌డీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేలా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇబ్రహీంపట్నంలోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

# కష్టపడి చదవాలి..

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

**ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్‌లలో పలు కార్యక్రమాలకు హాజరు**

ఇబ్రహీంపట్నం/అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 11 : విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. మండల కేంద్రంలోని సర్కారు దవాఖానలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి రోజూ వడ్డిస్తున్న భోజనంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. భవి ష్యత్తులో ఏయే రంగాల్లో రాణించాలనుకుంటున్నారని ఒక్కొక్కరిని అడిగి తెలుసు కున్నారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులు, గురువులను గౌ రవించాలన్నారు. భవిష్యత్తుకు మొదటి పునాదే పదోతరగతి అని విద్యార్థులు బాగా కష్టపడి చదవాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి ప్రధానోపా ధ్యాయుడు సురేశ్, ఉపాధ్యాయులను అభినందించారు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించడాన్ని కలెక్టర్ మెచ్చుకున్నారు.

### రోగులకు సరైన వసతులు కల్పిస్తాం..

ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానను కూడా కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కావాల్సిన పరికరాలు, రోగులకు మౌలిక వసతులకు సంబంధించిన వివరాల నివేదికను రూపొందించి పంపాలని ఆదేశించారు. దవాఖానలో అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో డీఈవో సుశీందర్‌రావు, ఇబ్రహీంపట్నం ఎంఈవో వెంకట్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### 'లైఫ్ సేవ్ కిట్' పరిశీలన

బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో గీత కార్మికులకు అందజేయనున్న 'లైఫ్ సేవ్ కిట్' ట్రయల్ రన్‌ను అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో నిర్వహించారు. గీత కార్మికుడు 'లైఫ్ సేవ్ కిట్' ధరించి చెట్టు ఎక్కడాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ శశాంక పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ, ఆర్డీవో అనంతరెడ్డి, టాడీ ట్యాపర్ కార్పొరేషన్ ఎండీ ఉదయ్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# మొరాయించిన సర్వర్

**జిల్లా వ్యాప్తంగా నిలిచిపోయిన వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు**

**సాయంత్రం వరకు పడిగాపులు కాసిన క్రయ విక్రయదారులు**

**ఈకేవైసీ వెరిఫికేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడమే కారణం**

**ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి!**

రంగారెడ్డి, జూలై 11(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గురువారం వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. యూడీఏఐలో ఈకేవైసీ వెరిఫికేషన్‌కు సంబంధించి సాంకేతిక సమస్య తలెత్తడంతో జిల్లాలోని 18 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు స్తంభించిపోయాయి. గురువారం అధిక సంఖ్యలో క్రయ విక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా ఆధార్ నంబర్లు ఆన్‌లైన్‌లో లింక్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వరకు కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో ముందే స్లాట్ బుక్ చేసుకుని వచ్చినవారంతా నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిత్యం 20 నుంచి 50 వరకు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. తద్వారా ప్రభుత్వానికి నిత్యం రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ గురువారం మొత్తం మూగబోవడంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడినట్లైంది.



శంకర్‌పల్లిలో..

మొయినాబాద్‌లో సర్వర్ రాకపోవడంతో పడిగాపులు కాస్తున్న జనం

# రుణ లక్ష్యం రూ.7528.45 కోట్లు

**బ్యాంకర్లు లక్ష్య సాధనకు కృషి చేయాలి : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**



వార్షిక ప్రణాళిక బుక్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 11 : జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.7,528.45 కోట్లు గా నిర్దేశించామని.. బ్యాంకర్లు తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం కలెక్టర్‌లోని తన చాంబర్‌లో బ్యాంకర్లతో రుణాల లక్ష్య సాధనపై ఆయన సమీక్ష నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి రూ.7,528.45 కోట్లుగా నిర్దేశించామని.. అందులో పంట రుణ కింద రూ. 3,434.23 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ. 7,25.51కోట్లు , అనుబంధ , చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.565.05 కోట్లు, విద్యాగృహ నిర్మాణం, ఇతర రంగాల కు రూ. 2,803.66 కోట్లుగా ఉన్నాయని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఏడాది వార్షిక ప్రణాళిక బుక్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ యాదగిరి, నాబార్డు డీడీఎం అఖిల్, ఆర్‌బీఐ ఎల్‌డీవో గోమతి తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ రైస్, గుట్కా పట్టివేత

**ఎస్పీ నారాయణరెడ్డి**

వికారాబాద్, జూలై 11 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్, గుట్కా వ్యాపారులపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేశారని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.7.5 లక్షల విలువైన ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ రైస్‌ను తరలిస్తున్నవారిపై అధికారులు దాడి చేసి 14.4 క్వింటాళ్ల బియంతోపాటు ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆయా పీఎస్‌ల పరిధిలో నిందితులపై కేసు నమోదైందన్నారు.





## • వర్ష సూచన

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): గాలి విచ్ఛిన్నతి ప్రభావంతో గురువారం రాత్రి గ్రేటర్‌లోని పలు చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 9గంటల వరకు వెస్ట్ మారేడ్‌పల్లి అత్యధికంగా 1.65, పికెట్‌లో 1.55, మాదాపూర్‌లో 1.48, ఉప్పల్ రాజీవ్‌నగర్‌లో 1.30, కాప్రా, అడ్డగుట్టలో 1.25, బోరబండ, చర్లపల్లి, బాలానగర్‌లోని ఓల్డ్ సుల్తాన్‌నగర్‌లో 1.0సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. గురువారం రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 34.5, కనిష్ఠం 24.5 డిగ్రీలు.. గాలిలో తేమ 72 శాతంగా నమోదైనట్లు తెలిపారు.

# జిమ్‌లలో స్టెరాయిడ్స్

## కండలు పెంచేందుకు 'మెఫెంటర్మైన్ ఇంజక్షన్లు సరఫరా

**పలు సెంటర్లలో పోలీసులతో కలిసి డీసీఏ దాడులు**

**ఓ జిమ్ సెంటర్ నిర్వాహకుడి అరెస్టు..**

**రూ. 3వేలు విలువైన ఇంజక్షన్లు స్వాధీనం**



సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): డబ్బు సంపాదనే లక్ష్యంగా కొందరు జిమ్ నిర్వాహకులు యువకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దేహదారుఢ్యం కోసం వచ్చే వారికి స్టెరాయిడ్‌తో కూడిన రక్తపోటు పెంచే ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నారు. వీటిని ఉపయోగిస్తే.. ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు కలుగడమే కాకుండా కొన్ని సార్లు ప్రాణాంతకంగా కూడా మారే ప్రమాదం ఉన్నట్లు డీసీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పలు జిమ్ సెంటర్లపై పోలీసులతో డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఓ జిమ్ నిర్వాహకుడిని.. అరెస్టు చేసి.. అతడి వద్ద నుంచి మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ డీజీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...సికింద్రాబాద్‌లోని తాడ్‌బంద్‌కు చెందిన ఎండీ ఖాసీం స్థానికంగా జిమ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అయితే తన వద్ద జిమ్‌కు వచ్చే వారికి త్వరగా దేహదారుఢ్యం వృద్ధి చెందడానికి నిబంధనలకు విరుద్ధంగా 'మెఫెంటర్మైన్ సల్ఫేట్' ఇంజక్షన్లను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు సికింద్రాబాద్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌సింగ్, మలక్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ బృందం, మార్కెట్ పోలీసులతో కలిసి గురువారం ఖాసీంకు చెందిన జిమ్‌సెంటర్‌పై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఖాసీంను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ.3వేల విలువ చేసే మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు.

### ఐదేండ్ల జైలు శిక్ష : డీసీపీ డీజీ కమలాసన్‌రెడ్డి

దేహదారుఢ్యం కోసం వినియోగించే మెఫెంటర్మైన్ సల్ఫేట్ వంటి ఇంజక్షన్లు తీవ్ర అనారోగ్యానికి దారితీస్తాయి. సాధారణంగా శస్త్రచికిత్సల సమయంలో రక్తపోటును పెంచేందుకు వీటిని రోగికి ఇస్తారు. సర్జరీ చేసే సమయంలో వెన్నెముకకు మత్తు ఇంజక్షన్ ఇచ్చినప్పుడు కొందరిలో రక్తపోటు పడిపోతుంది. అలాంటి సమయంలో రక్తపోటును పెంచేందుకు మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లు ఇస్తారు. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా తగిన మోతాదులో ఈ ఔషధం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇలాంటి ఇంజక్షన్లను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్కౌట్లు చేసి..దేహ దారుఢ్యాన్ని పెంచేందుకు ఈ ఔషధాలను విక్రయిస్తున్నారు. దీని వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడటమే కాకుండా కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి ఔషధాలను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవు. ఎవరైనా అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలు విక్రయించినా, నిల్వ చేసినా.. ఐదేండ్ల వరకు జైలు శిక్ష పడొచ్చు.

